

క్షమాపణ చెప్పాలి

- జగన్ మీడియాను మూసివేయాలి
- మహిళలను కించపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎస్పీకి తెలుగు మహిళల ఫిర్యాదు



పుట్టపర్తిలో డీపీఓ వద్ద జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

పుట్టపర్తి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన జగన్ టీవీ చానల్ ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకుడు వీవీఆర్ కృష్ణంరాజు తక్షణం క్షమాపణలు చెప్పాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసుకార్యాలయంలో జిల్లా ఎస్పీ రత్నకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతి గురించి జగన్ చానల్‌లో జుగుప్సాకరంగా మాట్లాడారన్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జగన్ మీడియాను మూసివేయాలని, భవిష్యత్తులో ఎవ్వరైనా మహిళలను కించపరిచేందుకు భయపడే విధంగా వీరికి గుణపాఠం చెప్పాలన్నారు. అంతకు మునుపు ఎయిర్‌పోర్టు ప్రధానరహదారిలో వైసీపీ, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన పత్రిక, చానల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పత్రిక ప్రతులను తగులపెట్టారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు రామాంజినమ్మ, లక్ష్మీదేవి, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు పర్వీన్‌తాజ్, శ్రీదేవి, మాధవి, లావణ్య, సామకోటి ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

జగన్ క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే కందికుంట



కదిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా తన సొంత చానల్‌లో లైవ్ డిబేట్‌ను ప్రసారం చేసిన వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఆయన భార్య వైఎస్ భారతి మహిళ లకు క్షమాపణ చెప్పాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీనియర్‌జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు మహిళల గురించి అలా మాట్లాడడం సరికాదన్నారు. కనీసం వైసీపీ అధ్యక్షుడు ఖండించకపోవడం శోచనీయమన్నారు. సాటి మహిళగా వైఎస్ భారతి నిస్సిగ్గుగా తన చానల్‌లో ప్రసారానికి అనుమతివ్వడం బాధకరమన్నారు.

ప్రతి అర్జీని బాధ్యతతో పరిష్కరించాలి

- కలెక్టర్ చేతన్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక లో ప్రజలిచ్చిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు బాధ్యతలో పరిష్కరించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 228 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలిచ్చిన ప్రతి అర్జీకి అధికారులు అర్థవంతమైన సమాధానమిచ్చి సకాలంలో పరిష్కరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి, కింది స్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలిచ్చిన ప్రతి అర్జీని ప్రతి వారం సమీక్షిస్తామన్నారు. అలాగే ఆడిట్ చేయిస్తామన్నారు. ఒకే సమస్యపై రెండోసారి ఫిర్యాదు అందితే అందుకు గల కారణాలను ఫిర్యాదుదారులకు తెలపాల్సి ఉంటుందన్నారు. భూసమస్యలు, రేషన్‌కార్డులు, ఇంటిపట్టాలు, పింఛన్లు మంజూరు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

80 ఫిర్యాదులు

పుట్టపర్తి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 80 అర్జీలు వచ్చాయి. వాటిని స్వీకరించిన ఎస్పీ రత్న.. అర్జీదారులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిధిలో సత్వరమే న్యాయం అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్‌పై ఫిర్యాదు

తన భార్య మృతికి కారణమైన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కదిరిలోని గాంధీనగర్‌కు చెందిన మనోహర్.. ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేశారు. ఓ ప్రభుత్వ డాక్టర్.. కదిరిలో క్లినిక్ నడుపుతున్నారన్నారు. క్లినిక్‌లో తన భార్య అనురాధకు చికిత్స చేశారన్నారు. ఆ తర్వాత మే 2వ తేదీన తన భార్య ఇంట్లో స్పృహతప్పి పడిపోయిందన్నారు. కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లినా సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం వహించి తన భార్య మృతికి కారణమైన ప్రభుత్వ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మనోహర్ ఫిర్యాదులో కోరాడు.

బాలికపై అత్యాచారం కేసులో ఆరుగురి అరెస్టు

రామగిరి మండలంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్పీ రత్న తెలిపారు. మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. నిందితులు గతంలోనూ అత్యాచారాలు చేసి, బాలికల గర్భం తీయించారని అన్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా బెదిరించారని, ఆ నేర చరిత్రనూ తోడుతున్నామని అన్నారు.

(వివరాలు మెయిన్‌లో..)

ప్రోత్సహించేందుకే షైనింగ్ స్టార్స్

- కలెక్టర్ టీఎస్ చేతన్
- ఇష్టంతో చదవాలి: ఎమ్మెల్యే సింధూర
- 225 మంది విద్యార్థులకు సన్మానం
- రూ.20 వేల చెక్కు, మెడల్స్, సర్టిఫికెట్ల ప్రదానం



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

కొత్తచెరువు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించాలన్నదే షైనింగ్ స్టార్స్ అవార్డుల ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మండలకేంద్రం సమీపంలోని శ్రీ వెంటేశ్వర కల్యాణమండపంలో సోమవారం 2024-25 షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అవార్డులతో సత్కరించారు. జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్‌లో 38, పదో తరగతిలో 187 మంది విద్యార్థులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ.. పిల్లలు తమలా కష్టపడకూడదని తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతూ చదివిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థీ.. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ.. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్ అవార్డులతో ప్రోత్సహిస్తోందన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ.. ఆశయం పెట్టుకుని, చదివితే విజయం తథ్యమన్నారు. మంచి భవిషత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు రూ.20 వేల చెక్కు, మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తూపల్లిలో తాగునీటి ఎద్దడి



తాగునీరు వృథా అవుతున్న దృశ్యం

కదిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని తూపల్లి ఎస్సీ కాలనీలో వారం రోజులుగా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోరుబావి నుంచి ట్యాంక్‌కు నీరు సరఫరా చేసే పైపులైన్ వారం రోజుల కిందట దెబ్బతింది. ఈ విషయంపై స్థానికులు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. పైపులైన్ పగిలి పోవడంతో ట్యాంక్‌కు నీరు సరఫరా కావడంలేదు. బోరు బావివద్ద ఉన్న పైపులైన్‌ను తొలగించి స్థానికులు తాగునీటిని పట్టుకుంటున్నారు. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. మరమ్మతులు చేస్తే నీటి వృథాను అరికట్టవచ్చని ప్రజలు అంటున్నారు. అయితే అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వారు అంటున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ నజీమాను వివరణ కోరగా సోమవారమే పంచాయతీ కార్యదర్శిని కాలనీకి పంపానని తెలిపారు. మంగళవారం స్వయంగా తాను వెళ్లి, మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.

పిడుగుపడి నలుగురికి గాయాలు

- చికిత్స పొందుతున్న యువకులు



చికిత్స పొందుతున్న ప్రణీత్, రాకేష్

హిందూపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మోతుకపల్లి వద్ద సోమవారం సాయంత్రం పిడుగుపడి నలుగురు యువకులకు గాయాలయ్యాయి. మోతుకపల్లికి చెందిన ప్రణీత్, రాకేష్, వంశీ, తరుణ్ సోమవారం సాయంత్రం కాలనీ సమీపంలో ఉన్నారు. అదే సమయంలో వర్షం ప్రారంభం కావడంతో చింతచెట్టు కిందకు వెళ్లి తలదాచుకున్నారు. ఈ సందర్భంగా సమీపంలోని కొబ్బరిచెట్టువద్ద పిడుగుపడింది. ఆ పిడుగుపాటుకు ప్రణీత్‌కు మెడవద్ద, రాకేష్‌కు కడుపుమీద కాలిన గాయాలయ్యాయి. వంశీ, తరుణ్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమీపంలో ఉన్నవారు వీరిని గమనించి వెంటనే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరిన అరగంట వరకు షాక్‌లో ఉన్నారు. వీరంతా విద్యార్థులని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది.

నేడు విత్తన వేరుశనగ పంపిణీ

కొత్తచెరువు, జూన్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడపల్లి రైతుసేవా కేంద్రంలో మంగళవారం విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి సవిత, కలెక్టర్ చేతన్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రారంభిస్తారన్నారు. జిల్లాకు ఇప్పటివరకు 28 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు సరఫరా అయ్యాయని, వాటిని రైతు సేవా కేంద్రాల్లో నిల్వయించామన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

హిందూపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఓ గ్రామంలో 15ఏళ్ల బాలికపై బలాత్కారం చేయబోయిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. హిందూపురం మండలం రాష్ట్ర సరిహద్దులో ఉన్న గ్రామానికి చెందిన కార్తీక్ అనే యువకుడు సోమవారం అదే గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఇంటివద్దకు వెళ్లాడు. అక్కడ ఎవరూలేనిది చూసి బాలిక చేయి పట్టుకుని లాగబోయాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. విషయాన్ని కుటుంబ సభ్యులతో చెప్పడంతో వారు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించిన సీఐ ఆంజనేయులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

పరిహారంలో న్యాయం చేయాలి

- టేకులోడు గ్రామసభలో రైతులు



గ్రామసభలో మాట్లాడుతున్న పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్

చిలమత్తూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు భూములు ఇవ్వడానికి సిద్ధమే కానీ, పరిహారం విషయంలో పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని అధికారులను రైతులు కోరారు. మండలంలోని టేకులోడు రెవెన్యూ పొలంలో 142.09 ఎకరాల పట్టా భూములను పరిశ్రమల కోసం రైతుల నుంచి ప్రభుత్వం సేకరిస్తోంది. భూసేకరణకు సంబంధించి రైతుల అభిప్రాయాలు తెలుసుకోవడంపై సోమవారం గ్రామంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో రైతులు పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. పరిశ్రమలు ఈ ప్రాంతానికి రావడంలో తమకు ఏ మాత్రం అభ్యంతరం లేదని, అయితే తరతరాలుగా జీవనాధారంగా ఉంచుకున్న పొలాలను పోగొట్టుకుంటున్నాం. ఇక నుంచి పూర్తి స్థాయిలో జీవన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని భూములు కోల్పోతున్న ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకునే విధంగా నష్టపరిహారం అందజేయాలని కోరారు. 2019లో ఇదే టేకులోడు రెవెన్యూ పొలంలో పరిశ్రమల కోసమంటూ భూసర్వే చేపట్టారని, అప్పట్లో ప్రభుత్వం ఎకరానికి రూ.25 లక్షల వరకు పరిహారం అందజేయడానికి ముందుకు వచ్చిందన్నారు. అయితే అనంతరం జరిగిన పరిణామాలతో భూసర్వే నిలిచిపోయిందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని ఇప్పటి భూముల ధరలను పరిగణలోకి తీసుకొని న్యాయమైన పరిహారం అందజేయాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పీఏ వీరయ్య మాట్లాడుతూ పరిహారం విషయం లో మంచి ధర ఇప్పించడానికి ఎమ్మెల్యే బాలకృష్ణతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. పరిహారం నిర్ణయించే విషయాన్ని జిల్లా కలెక్టర్ చూస్తారని, అందుకోసం మరోసారి గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటేశులు, గ్రామ సర్పంచ్ సరోజమ్మ, మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు. సీఐ జనార్దన్, ఎస్ఐ మునీర్ అహమ్మద్‌లు పాల్గొన్నారు.

దర్జాగా ఇసుక తరలింపు

- పెన్నానది, వంక ప్రాంతాల్లో తవ్వకాలు
- పగలు నిల్వ.. రాత్రి తరలింపు
- పట్టించుకోని అధికారులు



నిదనవాడ వద్ద పెన్నానదిలో నిల్వ ఉంచిన ఇసుక

శింగనమల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను అక్రమార్కులు యథేచ్ఛగా దోచేస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. దర్జాగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో అప్పటి అధికారుల అండతో విచ్చలవిడిగా పెన్నానది, ఇతర వంకల్లో ఉన్న ఇసుకను తరలించారు. ఇప్పుడూ అదే రీతిలోనే శింగనమల, గార్లదిన్నె, నార్పల, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల్లో ఇసుక దందా కొనసాగుతోంది. శింగనమల మండలంలో పెన్నానది 12 కిలో మీటర్లు ప్రవహిస్తుంది. కల్లుమడి తరిమెల, నిదనవాడ, రాచేపల్లి ఉల్లికల్లు నుంచి కొంత కాలంగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ ప్రాంత ఇసుకకు డిమాండ్ ఉండడంతో అనంతపురం తరలిస్తూ పెన్నానదిని కొల్లగొడుతున్నారు. సలకంచెరువు, జూలాకాలువ, కొరివిపల్లి, పెరవలి, పోతురాజుకాల్వ ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

పగలు నిల్వ.. రాత్రి తరలింపు..

శింగనమల మండలంలోని పెన్నానదితోపాటు వంక ప్రాంతాల్లో పగలు ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో సేకరించి ట్రాక్టర్ల ద్వారా ఒక చోట నిల్వలు ఉంచుతారు. రాత్రి సమయంలో సమీపంలోని

(మిగతా 6లో...)

వెలుగులోకి అక్రమాలు

- అనుమతి ఒకలా, నిర్మాణం మరోలా..
- వైసీపీ కార్పొరేటర్ కుమారుడి నిర్వాకం
- జీ ప్లస్1కు అనుమతి... అదనంగా మూడంతస్తులు
- రూ.కోటి విలువైన స్థలం కబ్జాలో వైసీపీ నాయకుడి హస్తం



లక్ష్మీనగర్‌లో కార్పొరేటర్ కుమారుడు రెండు భాగాల్లో నిర్మించిన భవనాలు

అనంతపురం క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నామనే ధీమాతో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. నగరంలో అక్రమ కట్టడాల బాగోతంలో వైసీపీ నాయకుల పాత్ర అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. చాలా భవనాల విషయంలో సిఫార్సుల పేరుతో చర్యలు తీసుకోకుండా ముడుపులు పుచ్చుకున్నారు. ఇప్పుడు వైసీపీ నాయకులే అక్రమ కట్టడాల్లో భాగస్వాములయ్యారు. అధికారులు మాత్రం నోటీసులతో సరిపెడుతున్నారు.

కార్పొరేటర్ కుమారుడి నిర్వాకం

అనుమతులు లేకపోయినా ఓ కార్పొరేటర్ కుమారుడు భవనం నిర్మించాడు. ప్రస్తుతం ఈ భవన నిర్మాణం వివాదస్పదమైంది. నగరంలోని 39వ డివిజన్ కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ కుమారుడు చింత కుంట మధు మూడేళ్ల కిందట నగరంలోని లక్ష్మీనగర్‌లో ఓ భవన నిర్మాణానికి అప్రూవల్ తీసుకున్నాడు. తన స్థలాన్ని రెండు భాగాలుగా చేసుకున్నాడు. ఓ భాగంలో జీప్లస్1గా నిర్మించారు. ఏడాది తర్వాత రెండో భాగంలో జీప్లస్1కు అదనంగా పైన రెండంతస్తులు నిర్మించాడు. నాలుగో అంతస్తుగా పెంట్ హౌస్ కూడా నిర్మించాడు. అయినా అప్పటి టౌన్‌ప్లానింగ్ అధికారులు నోరు మెదప లేదు. ప్రస్తుతం

(మిగతా 6లో..)

పెళ్లి అన్నందుకే..!

తన్మయి హత్యకు కారణం ఇదే.. చంపింది నరేష్?

- ఇదివరకే కులాంతర వివాహం
- అయినా తన్మయితో సాన్నిహిత్యం
- నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి రాయితో దాడి
- అరవడంతో బీరు బాటిల్ నోట్లో పెట్టి హత్య



నరేష్ (ఫైల్)



తన్మయి (ఫైల్)

అనంతపురం క్రైం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని తన్మయి(19) హత్య కేసు మిస్టరీ వీడింది. ఆమెను నరేష్ హత్య చేసినట్లు తేలింది. అయితే, పోలీసులు అధికారికంగా హత్య, హంతకుడి విషయాన్ని ఇంకా నిర్ధారించలేదు. అప్పటికే వివాహమైన నరేష్‌ను పెళ్లి చేసుకోవాలని తన్మయి ఒత్తిడి చేయడంతో అతను ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలిసింది. అనంతపురం శివారులోని రామకృష్ణ కాలనీకి చెందిన ఎరుకుల తన్మయి ఈ నెల 7వ తేదీ శవమై తేలిన విషయం తెలిసిందే. ఈ నెల 3వతేదీ ఇంటి నుంచి అదృశ్యమైన ఆమె.. అదే రోజు రాత్రి లేదా మరుసటి రోజు హత్యకు గురైనట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ హత్య తానే చేసినట్లు పోలీసుల విచారణలో నరేష్ ఒప్పుకున్నాడని, మరికొన్ని విషయాలు చెప్పాడని తెలిసింది. హత్యోదంతంలో ఒక్కడే పాల్గొన్నాడా, ఇంకా ఎవరైనా ఉన్నారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చివరి ఫోన్‌కాల్ అతడిదే..

అనంతపురం నగరంలోని ఆరో రోడ్డుకు చెందిన నరేష్ టైల్స్ పని చేస్తుంటాడు. కొంతకాలం క్రితం రామక్రిష్ణ కాలనీలోని ఓ కొత్త ఇంటికి టైల్స్ వేసేందుకు వెళ్లాడు. ఆ ఇల్లు తన్మయి ఇంటి సమీపంలో ఉంది. అలా నరేష్‌కు, తన్మయికి పరిచయం ఏర్పడింది. తన తండ్రి సెల్ నుంచి నరేష్‌కు ఫోన్ చేసేదని సమాచారం. అప్పుడప్పుడు నరేష్‌తో ఫోన్‌పేలో, నగదు రూపంలో డబ్బు తీసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 3వతేదీ రాత్రి తనకు కడుపునొప్పిగా ఉందని, కూల్‌డ్రింక్స్ తీసుకుంటానని చెప్పి తన్మయి బయటకు వెళ్లింది. అటు నుంచి ఆటో బైక్‌లో నరేష్‌తో కలిసి వెళ్లినట్లు సమాచారం. చివరి ఫోన్‌కాల్ నరేష్‌కు చేసినట్లు తెలుస్తోంది.

పెళ్లి సంబంధాల నేపథ్యంలో ఒత్తిడి..

నరేష్ ఏడాదిన్నర క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత తన్మయితో

(మిగతా 6లో..)

దర్జాగా ఇసుక తరలింపు



పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న వాహనాలు

(5వ పేజీ తరువాయి...)

అనంతపురం, తాడిపత్రి, నార్పల ప్రాంతాలకు తరలిస్తారు. ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. అధికారులకు నెల వారి మామూళ్లు చేరుతున్నట్లు తెలుస్తోంది. దీంతో దర్జాగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వాహనాలతో ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.2 వేల నుంచి రూ.5వేల వరకు, టిప్పర్ రూ.8వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రజలు నుంచి ఫిర్యాదు అందితే పోలీసులు హడావిడి చేయడం.. నాయకుల సిఫార్సుతో వదిలేయడం సాధారణమైపోయింది. అదీ లేకపోతే నామమాత్రపు అపరాధ రుసుం వేసి వదిలేస్తున్నారు. మిగిలిన శాఖలు అసలు పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం శింగనమల మండలం నిదనవాడ గ్రామస్థులు ఇసుక తరలింపును అడ్డుకొని వాహనాలను పోలీసులకు అప్పగించారు. భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసమవుతాయని, భూగర్భజలాలు తగ్గిపోతాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు.

అక్రమ తరలింపును అడ్డుకుంటాం

పెన్నానది, వంక ప్రాంతాల నుంచి ఇసుకను తరలించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి అడ్డుకట్ట వేస్తాం. ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సూచించాం. వారితో పాటు పోలీసు సిబ్బందితో కలసి తనిఖీలు చేస్తాం. అక్రమంగా తరలించే వాహనాలను జప్తు చేసి సంబంధింత యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

-ఓబులరెడ్డి, ఏడీ, భూగర్భ గనులశాఖ, తాడిపత్రి

వెలుగులోకి అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారి శిరీష అప్పటి నుంచీ పనిచేస్తున్నారు. కానీ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు.

ఆ స్థలం ఇంకా అలానే...

మారుతీ నగర్ శివారులో రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే కొంత నగర పాలిక స్థలం ఆక్రమించాడు. తన పార్టీకి సంబంధించి కార్యాలయానికి ప్రత్యేకంగా ఓ గదిని నిర్మించాడు. చుట్టూ ప్రహరీలాగా కంచె వేశారు. కొన్ని సెంట్లు కార్పొరేషన్ స్థలం ఆక్రమించారు. దాదాపు నాలుగేళ్ల కిందట ఈ వ్యవహారం జరిగినా అధికారులు ఆ స్థలం విషయంలో చర్యలు తీసుకోలేకపోయారు.

అశోక్‌నగర్‌లో కార్పొరేటర్ కుమారుడు..

నగరంలోని అశోక్‌నగర్‌లో నగరపాలిక స్థలం ఆక్రమణకు గురైంది. ఇందులో ఓ వైసీపీ కార్పొరేటర్ కుమారుడు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. సర్వేనెంబరు 2132, 2133ల పరిధిలోని ఐదు సెంట్ల నగర పాలిక స్థలం ఆక్రమించినట్లు తెలిసింది. దాదాపు రూ.కోటికి పైగా ఆ స్థలం విలువ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక ఆ కార్పొరేటర్ కుమారుడికి కొందరు టీడీపీ నాయకులు అండగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ స్థలానికి ఫెన్సింగ్ వేసే పనిలో ఉన్నారట. ఇక టౌన్ ప్లానింగ్ అధికారులు తమకు భవనాల నుంచి వచ్చే ముడుపులు చాలు కార్పొరేషన్ స్థలాలు ఎవరు ఆక్రమిస్తే ఏంటనే పరిస్థితిలో ఉన్నారు.

చర్యలు తీసుకోండి: టీఎన్‌టీయూసీ

అనంతపురం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 39వ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మోహన్‌కుమార్ కమిషనర్ బాల స్వామిని కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామికి సోమవారం ఆయన ఫిర్యాదు చేశారు. 39వ డివిజన్ కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ కుమారుడు చింతకుంట మధు అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. భవన నిర్మాణం కోసం ఒక అనుమతి తీసుకొని, నగర పాలక సంస్థ అధికారులకు తెలియకుండా మరో గృహ నిర్మాణం చేపట్టారన్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన వెంకటశివుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక సంక్షేమ మండలి వైస్ చైర్మన్‌గా టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని కార్మిక సంక్షేమ మండలి కార్యాలయంలో తన కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, అభిమానుల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. కార్మిక సంక్షేమ మండలి వైస్ చైర్మన్‌గా సక్రమంగా విధులు నిర్వర్తించి, రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం, అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నేటి నుంచి మంత్రి పర్యటన

ధర్మవరంరూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళ, బుధవారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు మంత్రి కార్యాలయ సిబ్బంది సోమవారం ప్రకటన ద్వారా తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు తాడిమర్రిలో నూతన తహసీల్దార్ కార్యాలయం, పబ్లిక్‌హెల్త్ యూనిట్ బ్లాక్‌ను ప్రారంభిస్తారనీ, మధ్యాహ్నం 12.30 గంటలకు అనంతపురంలో ఏబీవీపీ అభయసవర్గం సమావేశంలో పాల్గొంటారన్నారు. జూన్11న ఉదయం 6.30 గంటలకు ధర్మవరంలోని కాలేజీ గ్రౌండ్‌లో యోగా కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 11.30 గంటలకు గొట్లూరు గ్రామంలో వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, ఆ తరువాత ఎన్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ప్రకటనలో వెల్లడించారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆర్టీసీ కార్మిక పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి



పీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ కార్మిక పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం పీఓ చెండ్రాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019ను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించడం శుభపరిణామమన్నారు. సర్కులర్‌ను అన్ని డిపోలలో అమలు చేసి, అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ ఆపాలన్నారు. నాలుగేళ్లుగా ప్రమోషన్లు ఆగిపోయాయని, వెంటనే కల్పించాలన్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. జీఓ 114లో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సులను రూ.150ల నుంచి రూ.400లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాధాకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఈడీ ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి పరమేశ్వర్, కోశాధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వన్డే క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. ఈ టోర్నీలో అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు, కర్నూలు జట్లు పాల్గొంటాయన్నారు. తొలిరోజు అనంతపురం-కడప, చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు.

జిల్లా జట్టు ఇదీ..

వినయ్‌కుమార్ (కెప్టెన్), గిరినాథ్‌రెడ్డి, ఎంకె దత్తారెడ్డి, అర్జున్ టెండూల్కర్, మహేంద్రరెడ్డి, రాజు కుళ్ళాయప్ప, మల్లికార్జున, మహ్మద్‌కమిల్, దీపక్, సంతోష్, ప్రదీప్‌రెడ్డి, ప్రమోద్, రోహిత్‌రోషన్, వికాస్, జైకృష్ణ. స్టాండ్‌బైలుగా వీరారెడ్డి, చైత్రవర్ధన్, ప్రశాంత్, భానుప్రకాష్, లోహిత్‌సాయి కిశోర్, లీలసాయి.



జట్టు కెప్టెన్ వినయ్‌కుమార్

ఆర్‌అండ్‌బీలో బదిలీలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ఆర్ అండ్‌బీలో పలువురు సిబ్బందిని బదిలీ చేస్తూ బదిలీల కమిటీ సభ్యులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, మరో ఇద్దరు టెక్నికల్ ఆఫీసర్లు, మరో ముగ్గురు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లను, ముగ్గురు సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గత నెల 29న ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో బదిలీల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారితోపాటు ఆబ్లిగేషన్స్‌తో వినతులు పెట్టుకున్నవారికి సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుకు అనుగుణంగా సోమవారం జాబితాను ప్రకటించారు.

పంచాయతీరాజ్ లో ఇద్దరు ఈఈలు...

జిల్లాలోని పంచాయితీరాజ్ విభాగంలో ఇద్దరు ఈఈలను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఐయూ పెనుకొండ ఈఈగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డిని చిత్తూరు పీఆర్ఐ ఈఈగా బదిలీ చేశారు. ఏపీ సమగ్ర శిక్ష ఈఈగా డెప్యుటేషన్‌పై ఉన్న శంకరయ్యకు డెప్యుటేషన్ రద్దు చేసి పెనుకొండ పీఐయూ ఈఈగా బదిలీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్లు

ఉద్యోగి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
రాజేష్‌కుమార్	కర్నూలు డివిజన్ కార్యాలయం	ధర్మవరం ఈఈ కార్యాలయం
గోపాల్	అనంతపురం ఎన్‌హెచ్ డివిజన్	నంద్యాల ఈఈ కార్యాలయం
మురళీకృష్ణ	ధర్మవరం డివిజన్ కార్యాలయం	అనంతపురం ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయం
శ్రీధర్‌స్వామి	గుత్తి సబ్‌డివిజన్	అనంతపురం ఎన్‌హెచ్ సబ్‌డివిజన్ డీఈఈ కార్యాలయం
బాలవర్ధిరాజు	అనంతపురం డివిజన్	కర్నూల్ సబ్‌డివిజన్ డీఈఈ కార్యాలయం కార్యాలయం
లక్ష్మిదేవి	మడకశిర సబ్‌డివిజన్	అనంతపురం ఎస్‌ఈ సర్కిల్ కార్యాలయం
రామచంద్ర	అనంతపురం ఎన్‌హెచ్	గుత్తి సబ్‌డివిజన్ డివిజన్ కార్యాలయం
వెంకటచంద్రశేఖర్	అనంతపురం డివిజన్	నంద్యాల ఈఈ కార్యాలయం
గోవిందప్ప	నంద్యాల డివిజన్ కార్యాలయం	అనంతపురం ఈఈడివిజన్ కార్యాలయం
ఎస్ఆర్‌జీ ప్రసాద్	కర్నూలు సబ్‌డివిజన్ కార్యాలయం	అనంతపురం ఈఈ సబ్‌డివిజన్ కార్యాలయం
చంద్రశేఖర్	అనంతపురం సర్కిల్ కార్యాలయం	అనంతపురం ఈఈ సబ్‌డివిజన్ కార్యాలయం
	టెక్నికల్ ఆఫీసర్లు	
కృష్ణారెడ్డి	కళ్యాణదుర్గం డివిజన్ కార్యాలయం	అనంతపురం ఎన్‌హెచ్ డివిజన్ కార్యాలయం
పెంచలస్వామి	అనంతపురం ఎన్‌హెచ్ డివిజన్	ఆదోని ఎన్‌హెచ్ డివిజన్ కార్యాలయం
	అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు	
ఖాదర్‌బాషా	అనంతపురం ఎన్‌హెచ్ సర్కిల్ కార్యాలయం	కళ్యాణదుర్గం ఎన్‌హెచ్ డివిజన్ కార్యాలయం
గోవిందప్ప	కళ్యాణదుర్గం డివిజన్ కార్యాలయం	నంద్యాల ఈఈ డివిజన్ కార్యాలయం
ఓబులపతి	కర్నూల్ డివిజన్ కార్యాలయం	అనంతపురం ఎన్‌హెచ్ సర్కిల్ కార్యాలయం
	సూపరింటెండెంట్లు	
శ్రీనివాస రంగన్	నంద్యాల డివిజన్ కార్యాలయం	కళ్యాణదుర్గం ఈఈ డివిజన్ కార్యాలయం
కృష్ణకుమారి	కళ్యాణదుర్గం డివిజన్ కార్యాలయం	అనంతపురం ఎన్‌హెచ్ ఎస్‌ఈ సర్కిల్ కార్యాలయం
వీరభద్రయ్య	అనంతపురం ఎన్‌హెచ్	ఆదోని ఈఈ డివిజన్ సర్కిల్ కార్యాలయం

ఖజానా శాఖలో 41మంది..

అనంతపురం టౌన్, జూన్9 (ఆంధ్రజ్యోతి): ఖజానాశాఖలో జిల్లాస్థాయి పరిధిలో ఉన్న ఉద్యోగుల బదిలీలు సోమవారం ముగిశాయి. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న జిల్లా ఖజానాశాఖ ఆఫీస్‌లో అనంతజిల్లాశాఖ డీడీ వెంకటేశులు, శ్రీసత్యసాయిజిల్లాశాఖ డీడీ శ్రీనివాసరావుల సమక్షంలో ఉమ్మడి జిల్లాల ట్రెజరీ ఉద్యోగులకు బదిలీలను నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వీస్‌కాలం, రిక్వెస్ట్ బదిలీలు మొత్తం మీద 41 మందికి స్థానచలనం కలిగించారు. ఇందులో సీనియర్ అకౌంటెంట్‌లు 20మంది, జూనియర్ అకౌంటెంట్స్ ఎనిమిదిమంది. అటెండర్లు9మంది, డేటాఎంట్రీ ఆపరేటర్లు నలుగురు చొప్పన బదిలీ అయినట్లు డీడీ వెంకటేశులు తెలిపారు. ఎస్‌టీఓల బదిలీలు రాష్ట్రస్థాయి నుంచి ఇంకా రావాల్సిఉంది.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో...

అనంతపురం న్యూటౌన్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో ఇద్దరు డీఈలను బదిలీ చేస్తూ సోమవారం ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం క్వాలిటీ కంట్రోల్ డీఈగా ఉన్న రామారావును రాయదుర్గం డీఈగా బదిలీ చేశారు. పుంగనూరులో డీఈగా ఉన్న కిరణ్‌తేజను ఉమ్మడి అనంత జిల్లా క్వాలిటీ కంట్రోల్ డీఈగా నియమించారు. రాయదుర్గం డీఈగా ఉన్న శ్రీనివాసులును సత్యసాయి బోర్డు డీఈగా నియమించారు. జేఈఈల బదిలీల్లో భాగంగా ఉరవకొండ ప్రాజెక్ట్ జేఈఈగా ఉన్న బాలకృష్ణను అనంతపురం క్వాలిటీ కంట్రోల్ జేఈఈగా నియమించారు. అనంతపురం డివిజన్ కార్యాలయంలో ఉన్న జేఈఈ సాయిశశాంక్‌ను ఈఎన్‌సీ కార్యాలయానికి బదిలీ చేశారు. అనంతపురం డివిజన్ కార్యాలయంలో జేఈఈగా ఉన్న శ్రీలతను ఈఎన్‌సీ కార్యాలయానికి బదిలీ చేశారు. అనంతపురం డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆదిశంకర్‌ను ధర్మవరం సబ్‌డివిజన్ కార్యాలయానికి బదిలీ చేశారు. సర్కిల్ కార్యాలయంలో ఉన్న మాధవయ్యను పెనుకొండ కు బదిలీ చేశారు. పులివెందులలో ఉన్న వెంకటప్రసాద్‌ను అనంతపురం సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు. పెనుకొండలో ఉన్న నాగలక్ష్మమ్మను అనంతపురం క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ చేశారు. పుట్టపర్తి ఏటీఓగా ఉన్న రవికుమార్‌ను కళ్యాణదుర్గంకు బదిలీ చేశారు. కళ్యాణదుర్గంలో ఉన్న మహబుబ్‌బాషాను పుట్టపర్తికి బదిలీ చేశారు.

మార్కెటింగ్ శాఖలో..

అనంతపురంరూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖలో బదిలీల ప్రక్రియ సోమవారం రాత్రి జరిగింది. అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీగా పనిచేస్తున్న సత్యనారాయణ చౌదరి గుంటూరు ఏడీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తునిలో స్పెషల్ గ్రేడ్ కార్యదర్శిగా పని చేస్తున్న రాఘవేంద్రకుమార్‌ను నియమించారు. అనంతపురం ఎంపిక శ్రేణి కార్యదర్శిగా ఓడీపై పని చేస్తున్న గోవిందును రెగ్యులర్ కార్యదర్శిగా నియమించారు. ఇక్కడ గతంలో కార్యదర్శిగా పని చేస్తూ ఓడీపై కర్నూలు ఎంపిక శ్రేణి కార్యదర్శిగా వెళ్లిన జయలక్ష్మిని అక్కడికే రెగ్యూలర్ కార్యదర్శిగా నియమించారు. హిందూపురం స్పెషల్ గ్రేడ్ కార్యదర్శిగా పని చేస్తున్న చంద్రమౌళిని అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు. జిల్లాలోని మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి.

వ్యవసాయ శాఖలో...

అనంతపురం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
దేవేంద్ర	భూసార సంరక్షణా కేంద్రం, ఏటీపీ	రైతు శిక్షణా కేంద్రం, శ్రీ సత్యసాయి
మధుమతి	జేడీఏ ఆఫీస్, అనంతపురం	హిందూపురం ఏడీఏ ఆఫీస్
సునీత	రైతు శిక్షణా కేంద్రం, శ్రీసత్యసాయి	భూసార సంరక్షణా కేంద్రం, ఏటీపీ

సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ 2024 సంవత్సరానికిగాను టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఇందుకు 2022, 2023, 2024 సంవత్సరాలలో భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహసాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన సాహసికులు అర్హులన్నారు. సాహస క్రీడల్లో తమను తాము అంకితం చేసుకుని, నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ప్రతి ఏటా రాష్ట్రపతి బహూకరిస్తారన్నారు. అవార్డు గ్రహీతకు టెన్సింగ్ నార్కే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం, రూ.15లక్షలు నగదు అందజేస్తారన్నారు. ఆసక్తి, అర్హతగల సాహస క్రీడాకారులు ఈనెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9959517370 నంబరులో సంప్రదించాలన్నారు. వెబ్‌సైట్ http:///awards.gov.in/ ను సంప్రదించాలన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల బదిలీ

28 మంది గ్రేడ్-1,
17 మంది గ్రేడ్-2 సూపర్‌వైజర్లు
ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌జేడీ రోహిణి

అనంతపురం విద్య, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న గ్రేడ్ -1 సూపర్‌వైజర్లు, గ్రేడ్ -2 సూపర్‌వైజర్లను ఒక ప్రాజెక్టు నుంచి మరో ప్రాజెక్టుకు, పీడీ కార్యాలయాలకు బదిలీల చేస్తూ ఆర్‌జేడీ రోహిణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్ -1 సూపర్‌వైజర్లు 28 మందిని బదిలీల చేశారు. రాధను సోమందేపల్లి ప్రాజెక్టుకు, గంగరత్నమ్మను పెనుకొండకు, ఓబుళమ్మను కంబదూరుకు, నాగమణిని నార్పలకు, ఉమారాణిని రాయదుర్గానికి, సన్నక్కను గుడిబండకు, నాగేశ్వరిని తాడిపత్రికి, భారతమ్మను కంబదూరుకు, లతాకిరణ్‌ను సీకేపల్లికి, హేమలతను అనంతపురం అర్బన్ ప్రాజెక్టుకు, అన్నపూర్ణదేవిని నార్పలకు, రఫీమున్నీసాను అనంతపురం పీడీ ఆఫీస్‌కు, గంగాభవానీ ధర్మవరం ప్రాజెక్టుకు, అలివేలమ్మను కదిరికి, రామలక్ష్మమ్మను బీ. కొత్తకోటకు బదిలీ చేశారు. కణేకల్లు ప్రాజెక్టుకు రాజమ్మ, ఈశ్వరమ్మను, ఉరవకొండ ప్రాజక్టుకు రమాదేవి, శ్రీదేవి, పుష్పవతిని, శింగనమల ప్రాజక్టుకు, కల్పన, విష్ణువర్ధని, నేతాజీబీని, గుత్తి ప్రాజెక్టుకు పద్మావతి, దస్తగిరమ్మ, రాజేశ్వరిని, కళ్యాణదుర్గం ప్రాజెక్టుకు లక్ష్మీదేవమ్మ, రాధమ్మను బదిలీ చేశారు. వీరితోపాటు మరో 17 మంది గ్రేడ్- 2 సూపర్‌వైజర్లను ఒక ప్రాజెక్టు నుంచీ మరో ప్రాజెక్టు బదిలీ చేశారు.

మరో ఇద్దరికి కొవిడ్

నాలుగుకు చేరిన కేసుల సంఖ్య

అనంతపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో ఇద్దరికి సోమవారం కొవిడ్ నిర్ధారణ అయింది. దీంతో ఉమ్మడి జిల్లాలో పాజిటివ్ కేసుల సంఖ్య నాలుగుకు చేరింది. పెద్దవడుగూరు మండలానికి చెందిన ఓ గర్భిణి జిల్లా ఆస్పత్రిలో ప్రసవించారు. ఆమె జ్వరం, జలుబుతో బాధపడుతుండటంతో కొవిడ్ పరీక్షలు చేయించారు. ఆమెకు కొవిడ్ సోకినట్లు తేలింది. దీంతో ఆస్పత్రిలోని కొవిడ్ వార్డుకు తరలించి, చికిత్స చేస్తున్నారు. అనంతపురం రామ్‌నగర్‌కు చెందిన 30 ఏళ్ల మహిళ అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా ఆస్పత్రికి సోమవారం వచ్చారు. కొవిడ్ లక్షణాలు ఉండటంతో పరీక్షలు నిర్వహించారు. పాజిటివ్ వచ్చింది. హోమ్ ఐసొలేషన్‌లో ఉంటానని చెప్పడంతో ఆమెకు అవసరమైన మందులు ఇచ్చి పంపించామని సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే అనంతపురం పాతూరులో ఓ గర్భిణీకి, ధర్మవరంలో మరో గర్భిణికి పాజిటివ్ వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని నాలుగు పాజిటివ్ కేసులూ మహిళలవే కావడం, అందులో ఇద్దరు గర్భిణులు, ఒకరు బాలింత కావడం గమనార్హం. కాగా, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి కొవిడ్‌తో కర్నూలు జిల్లాలో చికిత్స పొందుతున్నారు.

పెళ్లి అన్నందుకే..

(5వ పేజీ తరువాయి)

పరిచయమైంది. ఇద్దరూ సన్నిహితంగా మెలిగారు. తన్మయికి పెళ్లి సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. దీంతో తనను పెళ్లి చేసుకోవాలని నరేష్‌పై ఒత్తిడి తెచ్చింది. నరేష్ తన భార్య నుంచి ఇబ్బంది ఎదురవుతుందని భావించాడు. ఈ నేపథ్యంలో పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

రాయితో కొట్టి.. బీరు బాటిల్ నోట్లో పెట్టి...

విశ్వసనీయ సమాచారం మేరకు, నరేష్ ఈనెల 3వతేదీ రాత్రి తన్మయిని బైక్‌లో ఎక్కించుకుని వెళ్లాడు. ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకుని కొంతసేపు ఉన్నారు. ఆ సమయంలోనూ తన్మయి పెళ్లి గురించి ఒత్తిడి తెచ్చింది. ఆ తరువాత అనంతపురం నుంచి దూరంగా తీసుకెళ్లాడు. కూడేరు మండలం గొట్కూరు సమీపంలో, అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కనున్న పొదల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ పెళ్లి గురించి మరోసారి చర్చకు వచ్చింది. తనకు ఇప్పటికే పెళ్లయిందని, పెళ్లి చేసుకోవడం కుదరదని నరేష్ స్పష్టం చేశాడు. అయినా బలవంతం చేయడంతో 'నీకు ఇప్పటికే పలువురితో సంబంధాలున్నాయి. నేనెలా చేసుకుంటాను?' అని ప్రశ్నించాడు. గొడవ ముదిరి.. అక్కడున్న రాయితో తన్మయి తలపై కొట్టాడు. కింద పడి అరుస్తుండటంతో మరోసారి రాయితో బాదాడు. అప్పటికీ తన్మయి బాధతో అరుస్తుంటే సమీపంలోని బీరు బాటిల్‌ను నోట్లో పెట్టి తలపై రాయితో మరోసారి కొట్టాడు. దీంతో కొంత సేపటికే తన్మయి ప్రాణాలు విడిచింది. తన్మయి అదృశ్యమైన 3వ తేదీనే ఈ ఘటన జరిగిందా, లేక 4వ తేదీ రాత్రి జరిగిందా అనేది తెలియాల్సి ఉంది. ఆమె చనిపోయాక పెట్రోల్‌పోసి నిప్పంటించాడా...? లేక ఎక్కువ రోజులు కావడంతో శరీరం కుళ్లిపోయి అలా తయారైందా అన్నదీ స్పష్టత ఇవ్వడం లేదు.

పట్టుకున్నా.. కట్టు కథలు

ఈనెల 3వతేదీన తన్మయి అదృశ్యమైంది. 4వ తేదీన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరేష్‌పై అనుమానం ఉందని చెప్పారు. దీంతో విచారణ నిమిత్తం నరేష్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. తానేమీ చేయలేదని నరేష్ కట్టుకథలు అల్లాడు. ఈ స్థాయిలో పోలీసులు కొంత నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. గుర్తుతెలియని మృతదేహం కనిపించేదాకా మిస్సింగ్ కేసులో పెద్దగా పురోగతి లేదు. ఆ తరువాత నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో నిజం ఒప్పేసుకున్నాడు.

నేడు విచారణకు పైలెట్ అనిల్

చెన్నేకొత్తపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద ఏప్రిల్ 8న చోటుచేసుకున్న ఘటనపై విచారణకు పైలెట్ అనిల్‌కుమార్ మంగళవారం హాజరవుతున్నారు. మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద వైసీపీ శ్రేణులు హెలికాప్టర్‌ను చుట్టుముట్టడం, విండ్ షీల్డ్ దెబ్బతిందని జగన్‌ను తిరిగి తీసుకువెళ్లకుండానే పైలెట్ హెలికాప్టర్‌ను తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా పైలెట్ అనిల్ కుమార్‌కు పోలీసులు నాలుగుమార్లు నోటీసులు ఇచ్చారు. మూడు నోటీసులకు వివిధ కారణాలు చూపి గైర్హాజరైన ఆయన.. ఎట్టకేలకు విచారణకు హాజరు అవుతానని విచారణ అధికారి రామగిరి సీఐ శ్రీధర్‌కు సమాచారం ఇచ్చారు. చెన్నేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు పైలెట్ విచారణకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. జూన్ 10న విచారణకు రావాలని పోలీసులు మే 21న తేదీన వాట్సప్ ద్వారా 4వ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇదివరకే కో పైలెట్ శ్రేయస్ జైన్‌ను పోలీసులు విచారించారు. హెలీప్యాడ్ కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహా సుమారు 70 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఇదివరకే పోలీసులు విచారించారు. పైలెట్ అనిల్ కుమార్ విచారణ పూర్తి అయితే హెలీప్యాడ్ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

అంతా పాస్

డిగ్రీ ఇన్‌స్టంట్‌లో వందశాతం ఉత్తీర్ణత

అనంతపురం సెంట్రల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించి డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షా ఫలితాల్లో వందశాతం విద్యార్థులు పాస్ అయ్యారు. ఈ మేరకు సోమవారం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ ఫలితాలను విడుదలచేసి మాట్లాడారు. డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులకు ఆదివారం పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. బీఏ, బీబీఏ, బీసీఏ, బీకామ్, బీఎస్సీ విద్యార్థులు మొత్తం 137మంది పరీక్షలు రాయగా అందరూ పాస్ అయ్యారన్నారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్లో ప్రదర్శించామని, విద్యార్థులు సర్టిఫికెట్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ శంకర్, సిబ్బంది సాయిశివ, దేవా, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా-డీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మా-డీ పరీక్షల ఫలితాలను సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెలలో ఐదో సంవత్సరం (ఆర్17) విద్యార్థులకు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల ఫలితాలను టీటీట్ప్ఃజ్ఞ్ట్టణ్తుగ్ఘ్టణ్తుటఃజ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ శివకుమార్, ఈసీలు ప్రొఫెసర్ శంకర్‌శేఖర్, శ్రీధర్, అంకారావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈఓగా శివశంకర్



అనంతపురం విద్య, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓగా శివశంకర్‌ను నియమిస్తూ పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న రామచంద్రారెడ్డిని ప్రభుత్వం ఉన్నఫలంగా బదిలీ చేయడంతో సీఈఓ పోస్టు ఖాళీ పడింది. ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా ధర్మవరం డ్వామాలో ఏపీడీగా పనిచేస్తున్న శివశంకర్‌ను జడ్పీ సీఈఓగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 468 విడుదల చేసింది.

క్రైం కార్నర్

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు- తిమ్మనచెర్ల రైలు మార్గంలో ఆదివారం రాత్రి గుంతకల్లు పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన బోయ అనిత(30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. అనిత భర్త సుధాకర్ బేల్దారి పని, అనిత కూలి పనులు చేస్తూ జీవించేవారు. సుధాకర్ మద్యానికి బానిసై పనికి వెళ్లే వాడుకాదన్నారు. భార్య కూలి పనులకు వెళ్లి తెచ్చిన డబ్బును సైతం తీసుకుని మద్యం సేవించేవాడన్నారు. దీంతో తన నలుగురు పిల్లలను ఎలా పోషించాలో తెలియక అనిత బాధపడుతుండేదన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ సమీపంలోని సరస్వతి విద్యామందిరం వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి మీద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక డ్రైవర్..


మహబూబ్‌బాషా (ఫైల్)

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహబూబ్‌బాషా (58) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం యాడికిలోని ఆంజనేయస్వామికాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు మహబూబ్‌బాషా సొంత లగేజీ బొలెరో వాహనం బాడుగలకు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కడుపునొప్పితో తరచూ బాధపడుతుండే వాడు. పలు చోట్ల వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. దీంతో జీవితం మీద విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య మహబూబ్‌బీ, వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తాడిపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


శివ మృతదేహం

గుంతకల్లుటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైటీచెరువు గ్రామంలో కేసరి శివ(19) సోమవారం ఇంట్లో కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన మేరకు వెంకటేష్, లక్ష్మీదేవి దంపతులు వ్యవసాయం చేసుకుని జీవించేవారు. వీరికి శివ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి వ్యవసాయ పనుల్లో శివ తోడుగా ఉండేవాడు. మధ్యాహ్నం ఇంట్లో మోటార్‌కు ప్లగ్ పెడుతుండగా షాక్ కొట్టి కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు శివను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెంది నట్లు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమార్తె అదృశ్యం



లేహన్య, అపురూప

కళ్యాణదుర్గం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురాకులతోట గ్రామానికి చెందిన తల్లీకూతురు అపురూప, లేహన్యా ఈ నెల 6 నుంచి కనిపించడం లేదని బంధువులు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందినట్లు సీఐ యువరాజు తెలిపారు. బంధువుల ఇళ్లల్లోను, చుట్టుపక్కల గ్రామాల్లోను తల్లీకూతురి ఆచూకీ కోసం వారు ప్రయత్నించినా సమాచారం లభ్యం కాలేదన్నారు. దీంతో సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ యువరాజుకు బంధువులు ఫిర్యాదు చేశారు. ఆచూకీ దొరికితే 7386400113, 9490106284 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

తాడిపత్రిలో బాలుడు..


గణేష్

తాడిపత్రి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన మల్లికార్జున కుమారుడు గణేష్ (15) అనే బాలుడు రెండురోజులుగా కనిపించలేదని పట్టణ పోలీసులు తెలిపారు. గణేష్ 9వతరగతి చదువుతున్నాడని, ఇంటివద్ద ఉండకుండా బయటకు ఆటల కోసం వెళుతుంటే తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 9440796861, 9346917120 నెంబర్లకు ఫోన్‌చేయాలని ఆయన పేర్కొన్నారు.

యాడికిలో యువతి..

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన యువతి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదని తెలిపారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఉరవకొండలో బాలిక..

ఉరవకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెరిమెట్ల గ్రామానికి చెందిన బాలిక (17) నాలుగు రోజుల క్రితం అదృశ్యమయినట్లు తండ్రి సోమవారం ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన బాలిక తన అవ్వ(అమ్మమ్మ) ఊరు, ఉరవకొండ మండలంలోని నెరిమెట్లకు వెళ్లింది. 6వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని తన అవ్వకు చెప్పింది. తిరిగి ఇంటికి రాలేదు. పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవటంతో తండ్రి ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మోసగించిన కేసులో యువకుడి అరెస్ట్

కదిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యువతిని మోసం చేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన కేసులో పుట్టపర్తి మండలంలోని దిగువచెర్లోపల్లికి చెందిన ప్రకాష్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... కదిరి పట్టణానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని ప్రకాష్ మోసం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ యువతి ఈనెల 3న ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై ఆమె తండ్రి ఫిర్యాదు ఇచ్చారన్నారు. ఈ కేసులు పరారీలో ఉన్న నిందితుడిని సోమవారం అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు చెప్పారు.

గాలివాన బీభత్సం..

- దెబ్బతిన్న పంటలు
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- మునిగిన పంట పొలాలు
- పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు
- ఉద్యాన రైతులకు భారీ నష్టం


కణేకల్లు వద్ద వేదవతి హగరిలో ప్రవహిస్తున్న వర్షపునీరు

బొమ్మనహాళ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు అరటి, విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. పత్తి పంటలో నీరు చేరి కాయలు రాలి, పత్తి తడిసిపోయింది. బొమ్మనహాళ్ మండలంలోని గోనేహాళ్ గ్రామం వద్ద 10 విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా కూలిపోయాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రాత్రి నుంచి ఉదయం వరకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎల్బీనగర్‌లోని వెంకటరెడ్డికి చెందిన ఆరు ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట నెలకొరిగింది. గోనేహాళ్‌క్రాస్‌లో ఇమ్రాన్ అనే వ్యక్తికి చెందిన మెకానిక్ షాప్‌పై చెట్టు పడి బండలు విరిగిపడ్డాయి. మండల కేంద్రంలో 7.2 మి.మీ వర్షపాతం నమోదయింది.

● కణేకల్లు : మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వేదవతి హగరి పొంగిపొర్లింది. ఆదిగానిపల్లి వద్ద పంటపొలాలు నీట మునిగాయి. బోరుబావుల ద్వారా సాగుచేసిన పత్తిపంట నీట మునిగింది. వరదనీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టు మరమ్మతులకు గురవ్వడంతో వర్షపు నీరంతా పొలాల్లో నిలిచిందని సర్పంచ్ రుద్రముని తెలిపారు.

● బెళుగుప్ప : మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు వర్షపునీటితో పొంగిపొర్లాయి. సేద్యపు పనులు చేయడానికి అనుకూలంగా వుంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


బొమ్మనహాళ్ మండలంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం


పెద్ద కొట్టాలపల్లి వద్ద వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న పొలాలు

26 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 26 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఉరవకొండలో 70.6 మీ.మీ. వర్షపాతం నమోదైంది. శెట్టూరు 56.4, ఆత్మకూరు 40.8, బ్రహ్మసముద్రం 40.4, కణేకల్లు 37.4, కళ్యాణదుర్గం 32.2, బెళుగుప్ప 30.4, గుంతకల్లు 23.4, కంబదూరు 22.6, కుందుర్పి 18.6, బుక్కరాయసముద్రం 9.2, బొమ్మనహాల్ 7.2, విడపనకల్లు 4.4, తాడిపత్రి, యల్లనూరు 4.2, పెద్దపప్పూరు 4.0, పామిడి 3.4, గుత్తి 3.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 2.8 మీ.మీలోపు వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు.

● రాయదుర్గంరూరల్ : మండలంలో ఆదివారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. వేపరాల, మల్కాపురం, జుంజురంపల్లి, కదరంపల్లి, రేకులకుంట తదితర గ్రామాలలో వర్షం కురవడంతో వంకలు, వాగులు, చెక్‌డ్యాంలలో నీరు చేరి జలకళ సంతరించుకుంది. వ్యవసాయ పనులను చేసుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


బొమ్మనహాళ్ మండలంలో నేలకొరిగిన అరటి చెట్లు

● శెట్టూరు : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి 56.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి తెలిపారు. మృగశిర కార్తి ఆరంభంలోనే మంచి వర్షాలు రావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాగులు, వంకలు చిన్నపాటి చెక్‌డ్యామ్‌లలో నీరు చేరింది.

● విడపనకల్లు : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పెద్ద కొట్టాలపల్లి వద్ద వర్షపునీటితో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వంకలు పొంగిపొర్లాయి. అంచనహాలు-పొలికి గ్రామాల మధ్యలోని పెద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో అంచనహాలు పొలికి ఉరవకొండ గ్రామాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ రాక పోకలు నిలిచి పోయాయి. వంక ఉధృతికి అటు వైపు ఎవరూ వెళ్లకుండా రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ నిర్వహించారు.

● ఉరవకొండ : పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. 76.6మీ.మీ వర్షపాతం నమోదైంది. బూదగవి చెరువులోకి భారీగా వరదనీరు చేరింది. ఉరవకొండలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైవర్స్ కాలనీ, హమాలి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కుప్పకూలిన బీర పంట

- 80 ఎకరాల్లో పంట ధ్వంసం
- రూ.కోటి వరకు నష్టం

కళ్యాణదుర్గం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సంతో బీర రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఆదివారం అర్ధరాత్రి విపరీతమైన ఈదురు గాలులతో కురిసిన వర్షం ధాటికి పందిరి వేసిన పంట నేలమట్టమయింది. సోమవారం ఉదయం తోటల్లోకి వెళ్లిన చూసిన రైతులు కుప్పకూలిన పంటను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 80 ఎకరాలకు పైగా బీర పంటను సాగు చేశారు. దాదాపు రూ. కోటి వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో కోత కోయాల్సిన బీర పంట ఈదురుగాలులకు నేలమట్టమయింది. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లి, జెల్లిపల్లిలోనే సుమారు 20 ఎకరాలకు పైబడి 10 మంది రైతులు సాగు చేశారు. ఈ రెండు గ్రామాల్లోనే అత్యధికంగా నష్టపోయారు. జెల్లిపల్లికి చెందిన నూర్ అనే రైతు మాట్లాడుతూ.. నాలుగు ఎకరాల్లో బీర పంటను సాగు చేశానని, సుమారు రూ. 4 లక్షలు ఖర్చు చేశానని తెలిపారు. రెండు రోజుల్లోనే కోత కోయాల్సి ఉండేదన్నారు. పంట అంతా కుప్పకూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటారెడ్డిపల్లికి చెందిన వక్కల రాజు అనే రైతు మాట్లాడుతూ.. తనకున్న రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన బీర పంటంతా కుప్పకూలిపోయిందన్నారు. సుమారు రూ. 2 లక్షలు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.


జెల్లిపల్లి వద్ద నేలకొరిగిన బీర పంటకు వేసిన పందిరి

అత్యాచారాల నివారణకు పటిష్ట చర్యలు ఏవీ..?

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకీ ఉమ్మడి జిల్లాలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతుండటం దురదృష్టకరమన్నారు. నిందితులు మద్యం మత్తులో ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారని పేర్కొన్నారు. చిలమత్తూరు మండలంలో అత్తాకోడళ్లపై జరిగిన అత్యాచారం, రామగిరి మండలం మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం, అనంతపురం రూరల్ మండలానికి చెందిన బాలిక హత్య జరిగినతీరుతో సభ్యసమాజం తల దించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ ఘటనపట్ల పోలీసులు రాజకీయనాయకులకు దాసోహం కావడం బాధితులకు మరోసారి అన్యాయం చేసినట్లే అవుతుందని విమర్శించారు. మహిళా కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనలనై సమగ్రంగా విచారించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రమ్మ, రామిరెడ్డి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ఆశయం

- ప్రాధాన్యాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి
- జిల్లా అధికారులకు సీఎం ఆదేశాలు

అనంతపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ఆశయమనీ, అందుకు అనుగుణంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఏడాది పాలన ముగిసిన సందర్భంగా సోమవారం కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సీఎం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకే స్వర్ణాంధ్ర విజన్-2047 అమలు చేస్తున్నామన్నారు. ఆ మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, గ్రామాల వారీగా వేర్వేరు ప్రాధాన్యతలు ఉంటాయన్నారు. ఈ నాలుగురకాల ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

అనంత జిల్లా ప్రణాళిక వెల్లడి

స్వర్ణాంధ్ర విజన్-2047కు అనుగుణంగా అనంత జిల్లాలో ప్రాధాన్యతల వారీగా ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం చంద్రబాబునాయుడుకు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సీఎం కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. రాయదుర్గం నియోజకవర్గంలో పరిశ్రలు అభివృద్ధి, మైనింగ్, వ్యవసాయం, ఉద్యాన రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో హార్టికల్చర్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాలు, ఉరవకొండలో నీటిపారుదల, ఉద్యానం, గుంతకల్లులో రైల్వేటూరిజం, అర్బన్ డెవలప్‌మెంట్, వ్యవసాయం, తాడిపత్రిలో పరిశ్రమలు, హార్టికల్చర్, టూరిజం, శింగనమలలో హార్టికల్చర్, రియల్ ఎస్టేట్, రెన్యువబుల్ ఎనర్జీ, అనంతపురం అర్బన్‌లో విద్య, వైద్యం, రాప్తాడులో పరిశ్రమలు, రియల్‌ఎస్టేట్, ఉద్యానరంగాలుకు ప్రాధాన్యమిస్తూ ప్రణాళికలు రూపొందించామని సీఎంకి కలెక్టర్ వినోద్‌కుమార్ వివరించారు. కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖజేడీ ఉమామహేశ్వరమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, రాజగోపాల్, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఎల్‌డీఎం శ్రీనివాస్‌యాదవ్, డ్వామా పీడీ సలీంబాషా, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి పాల్గొన్నారు.

గోకులం గోడు..!

- బిడ్డ బంగారం.. బైక్ తాకట్టు పెట్టి కట్టా..
- బిల్లులు ఇంకెప్పుడిస్తారు?
- ఎంపీడీఓ ఎదుట లబ్ధిదారుడి ఆవేదన


ఎంపీడీఓ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న గోకులం షెడ్డు లబ్ధిదారులు

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల బిల్లులు అందక లబ్ధిదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఒక్కొక్కరిది ఒక్కో వ్యథ. అప్పులు చేసి.. షెడ్లు కట్టుకున్నామనీ, నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోతే ఎలాగని మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన పలువురు గోకులం లబ్ధిదారులు సోమవారం ఎంపీడీఓ వీరరాజు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. నీలకంఠ అనే గోకులం లబ్ధిదారుడు మాట్లాడుతూ.. గోకులం నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో అప్పులు చేసి, షెడ్లు కట్టుకున్నామన్నారు. సంక్రాంతి సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా గోకులం షెడ్లను ప్రారంభించారన్నారు. ఆరునెలలు దాటినా ఇంతవరకు బిల్లులు పడలేదని తెలిపాడు. గోకులం నిర్మాణం కోసం అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక కూతురి బంగారాన్ని రూ.65వేలకు, బైక్‌ను రూ.35వేలకు తాకట్టు పెట్టాల్సి వచ్చిందన్నాడు. రేకులు అప్పుగా ఇచ్చిన వారు.. వాటిని ఊడదీసుకుపోతామంటున్నారని తెలిపాడు. అదే జరిగితే తనకు ఆత్మహత్యే శరణ్యమని వాపోయాడు. గోకులం షెడ్డు నిర్మాణ పనుల బిల్లులు తక్షణమే అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశాడు. కార్యక్రమంలో లబ్ధిదారులు హరి, పెద్దన్న, రామాంజనేయులు, పెద్దిరాజు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కోసమే స్పర్శ్ సెంటర్లు

- ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప

అనంతపురం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప పేర్కొన్నారు. ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో సోమవారం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణను రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్‌రెడ్డి వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ మాజీ సైనికులు, సైనిక వితంతువులు, అమర జవాన్‌ల కుటుంబ సభ్యుల పెన్షన్ సమస్యలు, పేర్ల సవరణలు తదితర అంశాల సత్వర పరిష్కారం కోసం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్లు పనిచేస్తాయన్నారు. సమస్యల పరిష్కారానికి సెంటర్ల నిర్వాహకులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో అన్ని అంశాలపై శ్రద్ధతో అవగాహన పొందాలన్నారు. అలాగే అన్ని జిల్లాల్లోని మాజీ సైనికులకున్న స్పర్శ్ పెన్షన్ వెబ్ యాప్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లాకు చెందిన ట్రైనర్ శ్రీనివాస వరప్రసాద్, లక్ష్మణరావు, రాయలసీమ జిల్లాల స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది గిరీష్, బాబా ఫకృద్దీన్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిమ్మప్ప

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


గంగప్ప (ఫైల్)

కుందుర్పి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానంపల్లికి చెందిన రైతు గంగప్ప(55) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ స భ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగప్ప తనకున్న నాలుగెకరాల పొలంలో టమోటా, కర్బూజా, పత్తి పంటలను సాగు చేసేవాడు. పంటలు చేతికి రాక నష్టపోయాడు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చే మార్గంలేక తీవ్ర ఆవేదన చెందుతుండేవాడు. ఈనేపథ్యంలో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువుల ఊరికి వెళ్లి ఉంటాడనుకున్నారు. ఆదివారం సా యంత్రం గ్రామ చివర గుట్ట ప్రాంతంలో దుర్వాసన వస్తుండడాన్ని పశువు ల కాపర్లు గుర్తించారు. అక్కడికెళ్లి చూడగా మృతదేహం చెట్టుకు వేలాడు తూ కనిపించింది. విషయం గ్రామస్థులకు తెలపడంతో వారు వచ్చి చూసి, గంగప్పదిగా గుర్తించారు. ఏఎస్‌ఐ వెంకటేష్.. రైతు మృతదేహాన్ని పరిశీలించారు. సోమవారం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గంగప్పకు భార్యలు ఈరక్క, సావిత్రమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రైతు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.33వేలు ధర పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 845టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యంతోనే తన్మయి హత్య

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, జూన్9(ఆంధ్రజ్యోతి): పోలీసుల నిర్లక్ష్యంతోనే ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య జరిగిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరలతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. రాష్ట్రంలో ఏడాది వ్యవధిలో 188మందిపై అత్యాచారాలు జరిగాయన్నారు. అలాగే 15మందిని అత్యాచారం చేసి హత్య చేశారన్నారు. చంబల్‌లోయలో కంటే రాష్ట్రంలో దారుణ పరిస్థితులు ఉన్నాయన్నారు. జిల్లాలో 72 మంది మహిళల మిస్సింగ్ కేసులున్నాయన్నారు. అమ్మాయిలు అదృశ్యమయ్యారని ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

వైసీపీ నాయకుల నిరసన

తన్మయి హత్య నేపథ్యంలో విద్యార్థిని కుటుంబసభ్యులతో కలిసి వైసీపీ నేతలు జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ విద్యార్థిని హత్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. నిర్లక్ష్యంతోనే హత్య జరిగిందన్నారు. ముందుగానే అప్రమత్తమై ఉంటే ప్రాణాలు నిలిచేవన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, మహిళా నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన సీతారాముల విగ్రహాలు

నంబులపూలకుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జౌకల గ్రామంలో సోమవారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ సందర్భంగా మూడురోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వ హించారు. నూతన విగ్రహాలను గ్రామంలో ఊరేగించి, వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఆలయంలో ప్రతిష్ఠించారు. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు దర్శన భాగ్య కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

రామాలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

నల్లచెరువు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బసవన్న కట్ట సమీపంలో ఉన్న పు రాతన రామాలయం జీర్ణోద్ధరణకు కె.భారతి అనే భక్తురాలు తన భర్త రాజునాయక్ జ్ఞాపకార్థం రూ. లక్ష విరాళం అందజేశారు. ఆమె సోమవారం గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆమెను శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పడుచూరి నగేష్, నరసింహారెడ్డి, వెంకట నారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

'నేడు పుట్టపర్తికి తరలిరండి'

నల్లమాడ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి మంగళవారం మండలం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలి రావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ గౌస్‌బాషా సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పుట్టపర్తిలోని సాయి ఆరామంలో విస్తృత సమావేశానికి హాజరువుతారని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నంబులపూలకుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ నిరంతరం పోరాటం కొనసాగిస్తోందన్నారు ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసి జీవితాలు, జీతాలు త్యాగం చేసిన వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, పర్వతరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, సుదర్శన్, గోపాల్, రామమోహన్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

కంకర మిషన్‌కు అనుమతి వద్దు

● తహసీల్దార్‌కు ధనియాన్‌చెరువు రైతుల వినతి

నంబులపూలకుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియాన్‌చెరువు రెవెన్యూ గ్రామ పరిధిలోని నెమళ్లగుట్టలో కంకర మిషన్‌కు అనుమతి ఇవ్వవద్ద ఆ గ్రామస్థులు తహసీ ల్దార్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సర్వేనెంబర్ 104నుంచి 127వరకు 130 ఎకరాల్లో తమ పూర్వీకుల నుంచి వ్యవసాయం చేసు కుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూముల అభివృద్ధికి ఇప్పటికే ఎఫ్ఈఎస్ స్వచ్ఛంద సంస్థ వారు నాబార్డు నిధులతో రూ. కోటి ఖర్చు చేసిందన్నారు. ఎస్ఎల్ఎన్ఎస్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ప్రైవేటు వ్యక్తులు 2018లో నెమళ గుట్టను మైనింగ్ లీజ్‌కు తీసుకున్నట్లు తెలిసింది. ఇక్కడ కంకర మిషన్ ఏర్పాటు చే స్తే 40 ఎకరాల్లో బోర్ల కింద పంటలు సాగుచేసిన రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ... ఈ విషయంపై పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఓబులరెడ్డి, గంగిరెడ్డి, తిరుమల, కేశవరెడ్డి, అనంతరెడ్డి, కొండయ్య, మహమ్మబూబ్‌బాషా, రామక్క, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే నివాళి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

నంబులపూలకుంట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియాన్‌చెరువు మాజీ ఎంపీటీసీ నారాయణప్ప సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం గ్రామానికెళ్లి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు దండే రవి, రెడ్డెప్ప, హనుమంతరెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ధర్మవరం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట గ్రామం వద్ద రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మామిళ్లపల్లి నుంచి ధర్మవరానికి వచ్చే వాహనాలను, రికార్డులను పరిశీలించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. రోడ్డు భద్రత నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎవరైనా నిబంధలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అప్పు చెల్లించలేదని పోలీసులకు ఫిర్యాదు

తనకల్లు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు 2017లో తిరుపతికి వెళ్లారు. అక్కడే జీవనం సాగిస్తూ చీటీలు నిర్వహించారు. వారి వద్ద చీటి వేసినట్లు తిరుపతికి చెందిన ప్రసాద్‌నాయుడు, స్వప్న తెలిపారు. అందుకు సంబంధించి కొంత సొమ్ము చెల్లించాల్సి వారు ఉంది. కొంత కాలానికి మండలానికి చెందిన వారు స్వగ్రామానికి మకాం మార్చారు. ఆ అప్పు కోసం ప్రసాద్‌నాయుడు, స్వప్న వారి ఇంటి ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం రాత్రి తనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యోగాతో ఆరోగ్య ఆంధ్రకు కృషి

● యోగాంధ్ర ర్యాలీలో కలెక్టర్ టీఎస్ చేతన్


పుట్టపర్తిలో యోగాంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తి టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా సాధన చేసే విధంగా అవగాహన కల్పించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని సత్యమ్మ దేవాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం నిర్వహించిన యోగాంధ్ర మహార్యాలీని కలెక్టర్, ఎస్పీ రత్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక ప్రశాంతతో పాటు, ఆరోగ్యం కుదుటపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు యోగాను సాధనంగా చేసుకుని ఆరోగ్యం కాపాడుకో వాలన్నారు. జిల్లాలోని ప్రముఖ అధ్యాత్మిక కేంద్రాలతో పాటు పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా జరిగే కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారన్నారు. అనంతరం చిత్రావతి హారతిఘాట్‌లో యోగా ప్రాధాన్యంపై విద్యార్థులకు వాసరచన పోటీలు నిర్వహించి, ప్రతికనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో యోగాంధ్ర ర్యాలీలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్)

ప్రతిరోజు యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మంచి ఆరోగ్యం కలుగుతుందని ధర్మవరం ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తదితర అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 25 నుంచి ఈ నెల 21వరకు పట్టణంలోని జూనియర్‌కళాశాల క్రీడామైదానంలో యోగా తరగతుల ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం యోగాంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా బత్తలపల్లి, బుక్కపట్నం, నంబులపూలకుంట, ఓబుళదేవర చెరువు, నల్లచెరువు, నల్లమాడ, తనకల్లు మండల కేంద్రాల్లో యోగాంధ్రపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంఈఓలతో పాటు మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్



నంబులపూలకుంటలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

15వ రోజుకు భూ నిర్వాసితుల ఆందోళన


పనులను అడ్డుకుంటున్న భూ నిర్వాసితులు

ముదిగుబ్బ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పరిహారం పెంచే వరకు నిరసన ఆగే ప్రసక్తే లేదని భూ నిర్వాసితులు తేల్చి చెప్పారు. పరిహారం పెంచాలంటూ ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి 342వ జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులు 15వ రోజు సోమవారం కూడా పనులను అడ్డకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ.. మండల కేంద్రం సమీపంలో ఎన్‌హెచ్ 342 రోడ్డు పనులు జరుగుతున్న ప్రాం తానికి వెళ్లి పనులను అడ్డుకున్నామని తెలిపారు. రూ. కోట్లు ధర పలికే భూములకు రూ. లక్షల్లో పరిహారం అందిస్తే ఎలా అంటూ వాపోయారు. పరిహారం పెంచే వరకు పనులు జరగనివ్వమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్, హనుమంతు, ప్రభాకర్, విశ్వనాథ్, బాలా రాము, సనత్, ముని, రఘునాథ్‌శాస్త్రి, నారాయణస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు... వదిలేశారు...


ఇళ్ల ఎదుట కాలువ తవ్వి వదిలేసిన దృశ్యం

ఓబుళదేవరచెరువు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మురుగునీటి కాలవ నిర్మాణం కోసం ఆర్నెల్ల కిందట మండలం కేంద్రంలోని చెరువు మరవ ప్రాంతంలో గుంతలు తవ్వారు. అయితే ఆ తరువాత మురుగునీటి కాలువ ఏర్పాటు పనులు చేపట్టలేదు. ఆ గుంతలను అలాగే వదిలేయడంతో ప్రజలు ఇళ్లలోకి వెళ్లాలన్నా, లోపటి నుంచి బయటకు రావాలన్న తీవ్ర ఇబ్బదులు పడుతున్నట్లు చెరువు మరవ ప్రాంతంలోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చిన్నారులు, వృద్ధుల చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. చిన్నారులు, వృద్ధులతో పాటు పలువురు ఆ గుంతల్లో పడి గాయాల పాలైన సంఘటనలు అనేకమున్నాయని వారు ఆవేదన వ్యకం చేస్తున్నారు. ఈ పరిస్థితిని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి కాలువ నిర్మాణం చేపట్టక పోగా, కనీసం గుంతలు పూడ్చలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చిన్నారులు, వృద్ధులు పడుతున్నట్లు మైనూ, ప్యారీ, బాబ్‌జాన్, శంకర్, తదితరులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి కాలువ నిర్మాణం పనులుచేపట్టాలని, లేకపోతే తవ్విన గుంతలు పూడ్చాలని ఆప్రాంత వాసులు కోరుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బత్తలపల్లి జూన్ 9(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ రామక్రిష్ణ తెలిపారు. బత్తలపల్లిలోని బృందావన కాలనీలో మల్లికార్జున నాయక్ ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన 750 కిలోల పీడీ బియ్యాన్ని విజిలెన్స్ అధికారి రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తహసీల్దార్ స్వర్ణలత ఫిర్యాదు మేరకు మల్లికార్జుననాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు. విజిలెన్స్ ఎస్ఐ గోపాలుడు, వీఈఓ చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

విజన్ డాక్యుమెంట్ జిల్లా యూనిట్ ప్రారంభం

పుట్టపర్తి టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్ జిల్లా యూనిట్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయం వద్ద ఆ యూనిట్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వికసిత భారత్‌కు అను గుణంగా స్వర్ణాంధ్ర - 2047 విజన్ సాధించడానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో యూనిట్ కార్యాలయాలు ఏర్పాటుచేశామని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని మండల కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో విజన్ డాక్యుమెంట్ రూపొందించామన్నారు. రానున్న ఐదేళ్లలో సాధించే అభివృద్ధితో పాటు 2047 నాటికి సాధించాల్సిన అభివృద్ధిని కూడా ఈ డాక్యుమెంట్లలో పొందుపరిచామన్నారు. ప్రజల తలసరి ఆదాయం పెంచడం, ఉద్యోగావకాశల కల్పన, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలు ఈ విజన్ డాక్యుమెంట్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● సీపీఎం నాయకుల డిమాండ్

కదిరి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలివ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం రూరల్ పరిధిలోని కుమ్మర వాండ్లపల్లి సర్వే నంబర్ 720 ప్రభుత్వ భూమిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో జెండాలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల వద్ద పలుమార్లు అందోళనలు చేపట్టామన్నారు. సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా, రెవెన్యూ అధికారులు కనీసం పరిశీలన చేయలేదన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి యేడాది గడుస్తున్నా, ఇప్పటివరకు ఒకరి కూడా ఇంటి స్థలం కేటాయించ లేదన్నారు. ఇళ్ల స్థలాల కోసం పేదలిచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లో పరిశీలించి, స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలోజెండాలు నాటిన ప్రదేశంలో గుడిసెలు ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీఎల్ నరిసింహులు, సాంబశివ, శాంతిబాయి, బాబ్‌జాన్;శివా, ముస్తాక్, బడా సుధాకర్‌రెడ్డి, లబ్ధిదారులున్నారు.

అత్యాచార ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలి

● ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రామగిరి మండలంలో దళితబాలికపై జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్నను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు పోలీసు కార్యాలయం ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ... ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు రక్షణలేకుండా పోయిందన్నారు. మహిళలకు అన్యాయం జరిగితే అదే ఘటనకు సంబంధించిన వారికి చివరిరోజు కావాలన్న మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని ఎస్పీని కోరామన్నారు.

అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణం

ధర్మవరం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిగడ్డపల్లి ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపో యింది. కాలనీకి చెందిన అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి రెండేళ్ల కిందట రూ. 12లక్షల నిధులు మంజూరయ్యాయి. కాం ట్రాక్టర్ స్లాబ్ వరకు పనులు చేశాడు. రూ.6 లక్షల నిధులను అధికారులు విడుదల చేశారు. చేసిన పనులకు ఇంకా రావాల్సిన మిగతా నిధులు విడుదల చే యకపోడంతో అప్పట్లో నిర్మాణ పనులను ఆయన అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో రెండేళ్లుగా ఆ భవనం నిర్మాణదశలోనే దిష్టబొమ్మలా దర్శనమిస్తోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఈ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో కాలనీలోని చిన్నారులు ఎస్సీ కాలనీ నుంచి సుమారు అర్ధ కిలోమీటరు దూరంలో ఉన్న గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. తమ కాలనీలోని భవన నిర్మాణం పూర్తి అవుతుందా అని ఎదురుచూస్తున్నట్లు కాలనీవాసులు పే ర్కొంటున్నారు. ప్రస్తు ప్రభుత్వమైనా నిధులు విడుదల చేసి నిర్మాణ దశలోనే అర్ధంతంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాన్ని పూర్తిచే యాలని కాలనీవాసులు కోరుతున్నారు.


నిర్మాణ దశలో నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రం

జగన్ చానల్‌పై చర్యలు తీసుకోవాలి

● పోలీస్ స్టేషన్‌లో తెలుగు మహిళల ఫిర్యాదు


పట్టణ సీఐ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు

కదిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జగన్ చానల్‌లో నిర్వహించిన డిబేట్‌లో మహిళలను కించపరిచేలా ఆ చానల్ ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకులు కృష్ణమరాజుపైన, ఆ చానల్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్‌చేశారు. ఈ మేరకు వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళ పట్ల వైసీపీకి ఏమాత్రం గౌరవం లేదన్నారు. జగన్ చానల్ నిర్వాహకురాలు వైఎస్ భారతి మహిళ అయినప్పటికి మహిళలను కించపరిచేలా జర్నలిస్టులు మాట్లాడితే దాన్ని ఖండించకపోవడం హేయమైన చర్య అన్నారు. మహిళలను కించపరచి మాట్లాడడం వైసీపీ నాయకులకు పరిపాటి అయిందన్నారు. ఇలాంటివారిపై చట్టపరమైనచర్యలు తీసుకోవాలంటూ సీఐ నారాయణరెడ్డికి ఫిర్యాదు అందించారు. ఈ కార్యక్రమంలో 17 వార్డు కౌన్సిలర్ సావిత్రమ్మ, తెలుగు మహిళలు రమణమ్మ, ఉమాదేవి, గంగరత్నమ్మ, సమీనాబీ తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి


జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుట్టపర్తిరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగాతోనే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో సోమవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగావలన మనిషి జీవితానికి ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశాన్ని, రాష్ట్రాన్ని ఆ దిశగా తీసుకెళ్లేందుకు కృష చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజు యోగా కార్యక్రమంలో పాల్గొంటే విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, సోషియల్‌వెల్ఫేర్ అధికారి శివరంగప్రసాద్, యోగా మాస్టార్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు భూములను గుర్తించండి: ఎమ్మెల్యే

పుట్టపర్తిరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ భూమలను గుర్తించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆరుమండలాల తహసీల్దార్లకు సూచించారు. ఆమె సోమవారం జిల్లా కేంద్రంలో ఆర్డీఓ నూతన చాంబర్‌ను ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ భూములను గుర్తించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలను వెంటనే గుర్తించాలని సూచించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమలో ఆరుమండలాల తహసీల్దార్లు అనంత ఆచారి, రామ్‌నాథరెడ్డి, రంగనాయకులు షాబుద్దీన్, రామాంజినేయులు, కళ్యాణ్, మునిసిపల్ కమిషనర్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మంగళవారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10 గంటలకు మునిసిపల్ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు నియోజకవర్గంలోని పెడపల్లి జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనవేరుశనగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

తనకల్లు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఉంది. సోమవారం సాయంత్రం మండలకేంద్రానికి చెందిన ఆసిక్ అనే వ్యక్తి మద్యం మత్తులో టవర్‌పైకి ఎక్కారు. దీంతో బస్టాండ్ ప్రాంతం రాత్రి ఎనిమిది గంటల వరకు జన సమూహంతో నిండిపో యింది. పోలీసులు వచ్చి బతిమాలినా అతడు కిందికి దిగలేదు. తన కున్న ఇంటి సమస్యలను పరిష్కారం చేస్తేనే దిగుతానంటూ భీష్మించి కూర్చున్నాడు. దీంతో పాపం పోలీసులు పడిగాపులు గాయాల్సి వచ్చింది. రాత్రి 8 గంటలకు పోలీసులు గుమిగూడిన జనాన్ని అందరిని తరిమివేశారు. దీంతో ఆసిక్ కిందికి దిగివెళ్లిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆసిక్ సమస్య ఏమిటో విషయం తెలుసుకుని పరిష్క రించాలని గ్రామస్థులు కోరారు.

ఉత్సాహంగా

సౌత్‌జోన్ మహిళా క్రికెట్

● ఐదు జిల్లాల క్రీడాకారిణుల హాజరు

నెల్లూరు(విద్య), జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని సీఏపీ క్రీడా మైదానంలో సోమవారం అండర్-15 మహిళల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రికెట్ క్రీడాకారిణిలు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు పోటీలను నిర్వహించనున్నారు. తొలిరోజు పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని ఈ.గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 118 పరుగులకే ఆలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా, టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు 16 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 21.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులతో విజయం సాధించింది. తొలిరోజు ఈ పోటీలను ఎన్‌డీసీఏ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కే.శ్రీనివాసులరెడ్డి, జనరల్ మేనేజర్ పీ. భాను ప్రకాష్‌రెడ్డి, రాష్ట జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు బీ.లీలామోహన్‌రెడ్డి, ఏసీఏ అంపైర్స్ పవన్‌కిషోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.

సభ్యులకు చెప్పకుండానే అభివృద్ధి పనులా..?

- టీ, బిస్కెట్ కోసం రావాలా..?
- కమిషనర్‌పై సభ్యుల ధ్వజం ● రసాభాసగా కౌన్సిల్‌మీట్



కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్ భాస్కర్‌నాయక్

పెనుకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండానే అభివృద్ధి పనులు చేపడతారా, మా వార్డుల్లో పనులు కూడా తెలియకుండా చేస్తారా, టీబిస్కెట్ కోసం సమావేశానికి రావాలా అంటూ కమిషనర్‌పై కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ ఉమర్‌ఫరూక్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండా చెదివి వినిపించారు. కొందరు కౌన్సిలర్లు కమిషనర్ సతీష్‌కుమార్ తీరుపై మండిపడ్డారు. ప్రతి సమావేశంలో సభ్యులకు తెలియకుండానే అజెండాను ప్రవేశ పెడుతున్నారని వాగ్వాదానికి దిగారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చినా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ నందినిరెడ్డి మాట్లాడుతూ సభ్యులకు తెలియకుండా అభివృద్ధి పనులు ఎలా చేపడతారని నిలదీశారు. తన ఇంటి ముందే కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదని చెప్పినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. కౌన్సిలర్ భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ సమావేశాలకు తమను తూతూమంత్రంగానే ఆహ్వానిస్తున్నారని, సమస్యలపై చర్చించడం లేదని, టీ బిస్కెట్లకు మాత్రమే వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ద్వారా ఎంపికైన తమను ప్రజాప్రతినిధులుగా గుర్తించడంలేదన్నారు. సమావేశాలు ఇలాగే కొనసాగితే వాకౌట్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వచ్చే సమావేశంలో సభ్యుల సలహాతో అజెండా రూపొందించాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం వీర జవాన్ మురళీనాయక్, మున్సిపల్ కార్మికుడు మృతికి నివాళి అర్పించారు. ఆర్‌ఓ దినేష్‌కుమార్, మేనేజర్ వెంకటరమణ, కౌన్సిలర్లు షబీనాబాను, గిరి, సద్దాం హుస్సేన్, రఘునాథ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన విత్తన వేరుశనగ



విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న నాయకులు

సోమందేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగ ఎట్టకేలకు సోమవారం మండలానికి చేరింది. పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో వేరుశనగ కాయలను అన్‌లోడ్ చేశారు. టీడీపీ నాయకులు సూరీ, కిష్టప్పలు విత్తన కాయలను పరిశీలించారు. ఏఓ కవితారాణి మాట్లాడుతూ సబ్సిడీపోను కె-6 రకం బస్తా 1,674 రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎకరాలోపు ఉన్నవారికి ఒక బస్తా ఎకరం పొలం ఉన్నవారికి రెండు బస్తాలు, అంతకు మించిన రైతులకు మూడు బస్తాలు అందజేస్తామన్నారు. పంపిణీ తేదీని త్వరలో ప్రకటిస్తామని ఏఓ తెలిపారు.

నేడు విత్తన పంపిణీ

మడకశిర రూరల్: మండలంలోని బుళ్ళముద్రం పంచాయతీ రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం రైతులకు విత్తన వేరుశనగాను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప తెలిపారు. ముఖ్య అథితులుగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు.

అమరాపురం: మండలంలోని రైతులకు మంగళవారం సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు ఏఓ మంజునాథ్ తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో వేరుశనగ తీసుకోవచ్చన్నారు.

దోషులను శిక్షించాలి



నినాదాలు చేస్తున్న బహుజన చైతన్యవేదిక సభ్యులు

పెనుకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం ఓ గ్రామంలో దళిత బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం ఉదయం చైతన్యవేదిక సభ్యులు, ప్రజలు, దళితులు, బ్యానర్లు, ప్లకార్డులు చేతపట్టుకుని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాయలంలో ఏఓ గిరిధర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు రంగేపల్లి నాగరాజు, గౌరవ సలహాదారుడు వెంకటేశ్, రొద్దం బాబు, రామాంజినప్ప, సూర్యనారాయణ, కిష్టప్ప, కదిరప్ప పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి కృషి

హిందూపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌యార్డ్ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని యార్డు చైర్మన్ అశ్వత్థనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రమేష్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో మండి మర్చెంట్, కమిషన్ ఏజెంట్లు నూతనంగా ఎన్నికైన కమిటీ పాలకవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ మార్కెట్‌యార్డ్‌లో అన్నాక్యాంటిన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాపారులకు, ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ బాలచంద్రనాయక్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, మండి మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీకాంత్, దీపక్, గురుమూర్తి, అమర్నాథ్, కోఆర్డినేటర్ రాఘవేంద్ర, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల అండతోనే జూద కేంద్రాలు

పావగడ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాలూకావ్యాప్తంగా మట్కా, పేకాట, జూద కేంద్రాలకు పోలీసుల అండతోనే విచ్చలవిడిగా జూదాలు నడుస్తున్నాయని దళిత సంఘం నాయకులు ఆరోపించారు. సోమవారం జరిగిన దళిత హితరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో సీఐ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు గ్రామాల్లో ఉన్న నాయకుల అండదండలతో, పరిచయాలతో మట్కా, పేకాటరాయుళ్లకు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఐ చొరవ తీసుకుని జూదాలకు అడ్డుకట్ట వేయకపోతే పోలీసు కార్యాలయం ముందు ధర్నా చేపడతామని సమితి సభ్యులు నారాయణప్ప, టీఎన్ పేట రమేష్ హెచ్చరించారు.

'పురం' మున్సిపల్ కమిషనర్ బదిలీ

హిందూపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సంగం శ్రీనివాసులును మాతృశాఖకు బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్యులు వెలువడ్డాయి. సంగం శ్రీనివాసులు డీఆర్‌డీఏ(సెర్ప్) విభాగంలో అకౌంటెంట్‌గా పనిచేస్తూ డెప్యుటేషన్‌పై హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. గత నెల 9వ తేదీకే ఈయన డెప్యుటేషన్ ముగియడంతో సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగం ఆయనను సొంతశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్యులు జారీ చేశారు. ఇదిలా ఉంటే హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అధికారే వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

మార్కెట్ యార్డ్ కార్యదర్శి బదిలీ: హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి చంద్రమౌళిని సోమవారం బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్యులు జారీ చేసింది. చంద్రమౌళిని ఎమ్మిగనూరుకి బదిలీ చేయగా, నందిగామలో పనిచేస్తున్న ఎం.ఎల్ నరసింహమూర్తిని హిందూపురానికి బదిలీ చేశారు.

న్యూస్ బాక్స్

పురంలో వర్షం



రైల్వే స్టేషన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

హిందూపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం సాయంత్రం అరగంటపాటు వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రైల్వేస్టేషన్ రోడ్డు, బాలాజీ సర్కిల్‌లో మోకాళ్లలోతు నీరు నిలబడ్డాయి. అటువైపు వచ్చే ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి మురుగునీరు, వర్షంనీరు రోడ్డుపైకి చేరాయి.

రొద్దంలో...



రొద్దంలో కురుస్తున్న వర్షం

రొద్దం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలో తొలకరి వర్షం పలకరించింది. వారం రోజులుగా ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి ఉపశమనం కలిగించింది. రొద్దం మండలంలో వేలాది ఎకరాల్లో కందిపంట సాగుకోసం రైతులు సిద్ధమవుతున్నారు. గత ఏడాది సాగుచేసిన కంది రైతులు లాభసాటిగా మారడంతో ఈసారి అత్యధిక సంఖ్యలో పంటను సాగుచేసేందుకు సన్నద్ధమయ్యారు. ఒక్కో రైతులు 30నుంచి వంద ఎకరాలదాకా కంది పంట సాగుచేయనున్నారు. మృగశిరకార్తె రావడంతో తొలకరి వర్షం మండల రైతులను పలకరించింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు విత్తన వేరుశనగ సరఫరా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

అగళి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు అన్నారు. మండలంలోని 37 ప్రాథమిక పాఠశాలలకు ముందుగానే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ఎంఈఓ తెలిపారు. ఎంఆర్సీ సిబ్బందితో కలిసి వాహనంలో పాఠ్యపుస్తకాలను ప్రతి పాఠశాలకు అందజేస్తున్నామన్నారు. 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి బయోమెట్రిక్ ద్వారా కిట్లను విద్యార్థులకు అందజేయాలని సూచించారు. కిట్లలో నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, తదితర వాటిని అందిస్తామన్నారు.

హిందూపురం(రొద్దం): మండలంలో 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు చేరవేశామని ఎమ్మార్సీ సిబ్బంది తెలిపారు. ప్రభుత్వం మందస్తుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బూట్లు, యూనిఫాం, తదితర వాటిని అందించాలని ఆదేశించింది. సోమవారం జడ్పీ ఉన్నతపాఠశాల నుంచి ఎమ్మార్సీ సిబ్బంది పాఠశాలలకు వేర్వేరుగా పాఠ్యపుస్తకాలను చేర్చినట్లు ఎమ్మార్సీ సిబ్బంది నరేష్, ఈశ్వర్, వనజ తెలిపారు.

మార్కెట్ యార్డుకు పూర్వవైభవం తెస్తాం

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మడకశిర మార్కెట్ యార్డుకు పూర్వ వైభవం తెస్తామని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. సోమవారం మార్కెట్ యార్డు నూతన పాలకమండలి ప్రమాణాస్వీకారోత్సవ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామితో కలసి ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పనిచేసేవారికి గుర్తింపులేక వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకమండలి సభ్యుల పదువులు డబ్బులకు అమ్ముకొన్నారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో అలాంటి వాటికి ఆస్కారం ఉండదన్నారు. కూటమి ప్రభుత్వంలో నిబద్ధతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. టీడీపీలో కష్టపడిన వారిని గుర్తించి కులాల వారిగా పదువులను ఇచ్చారన్నారు. 40 సంవత్సరాల పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన గురుమూర్తిని గుర్తించి మడకశిర మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా చంద్రబాబు అవకాశం ఇచ్చారన్నారు. మార్కెట్ యార్డు రైతులకు వరంగా మారాలని, అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతులు పండించిన చింతపండు, వేరుశనగ, వక్క, మిర్చి పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించి వారికి మేలు చేకూర్చేవిధంగా కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను సరిచేస్తూ భవిష్యత్తులో రైతులకు ఎలాంటి లాభం చేకూర్చవచ్చో నూతన మార్కెట్ సభ్యులు ఆలోచించి ముందుకు సాగాలన్నారు. పార్టీలకు అతీతంగా మార్కెట్ యార్డ్ అభివృద్ధి చెందేవిధంగా కృషి చేయాలని సూచించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా బి.ఎన్.గురుమూర్తి, వైస్ చైర్మన్‌గా శ్రీదేవితోపాటు 13 మంది కమిటీ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, పార్టీ పరిశీలకులు పార్థసారథి రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, ఐదు మండలాల కన్వీనర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.జయకుమార్, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలి



కుటీర పరిశ్రమలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

రొద్దం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో ఎంఎస్ఎంఈల ద్వారా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సహకరిస్తోందని సీడాప్ మేనేజర్ తులసీనాయుడు అన్నారు. సోమవారం రొద్దం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుకింద సీడాప్‌కు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సంస్థ ప్రతినిధులు రుణ గ్రహీతలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల ద్వారా అనేక రకాల కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకు ప్రాజెక్ట్ రిపోర్ట్ చేయించుకుని పరిశ్రమలు స్థాపించవచ్చన్నారు. ఎంపీడీఓ రాంకుమార్, టీడీపీ నాయకులు చంద్రమౌళి, మంజునాథ్, వాల్మీకి చంద్రశేఖర్, హిందూపురం పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు హరీష్ పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: ప్రతి ఇంటి నుంచి వ్యాపారవేత్తను చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సిడాప్ ట్రైనర్ తులసీరాం అన్నారు. సోమవారం పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో సిడాప్ అధికారులు రుణాలపై అవగాహన కల్పించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, మండల కన్వీనర్లు శ్రీరాములుయాదవ్, ఈశ్వరప్రసాద్, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, గుట్టూరు సూరీ, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు అన్నదానం



గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భవతులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని, ఊపిరి ఉన్నంతకాలం ప్రజల ఆరోగ్యం కోసం అన్నదాన కార్యక్రమాలు చేపడతామని టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్‌బాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు అన్నదానం చేశారు. మంత్రి సవిత తన తండ్రిపేరిట స్థాపించిన ట్రస్ట్‌తో ఆరేళ్లుగా అన్నదానం చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ ఆయిషాతస్లీమా, వైద్యులు ఓంకార్, నాయకులు డీవీ ఆంజనేయులు,వెంకటేశులు, సూరీ, కిష్టప్ప పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఒకే ఒక్కడు



తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న డీటీ

సోమందేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక క్యార్యక్రమం జరిగింది. మండల స్థాయి అధికారులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడంతో కార్యాలయంలోని తహసీల్దార్ ఛాంబర్‌లో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఇన్‌చార్జి డీటీ రెడ్డిశేఖర్ ఒక్కరే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

లేపాక్షి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని తిరుమలదేవరపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు తిరుమల దేవరపల్లికి చెందిన సునీత(39) అనే మహిళ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేదన్నారు. పలుచోట్ల పరీక్షలు చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుమార్తె మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. సునీతకు భర్త ఆదినారాయణ, కుమార్తె ఉన్నారు.

ప్రతి ఇంటికి శుద్ధ నీటిని అందిస్తాం

చిలమత్తూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి శుద్ధ నీటిని అందిస్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య అన్నారు. సోమవారం మండలంలోని టేకులోడు పంచాయతీ నల్లబొమ్మనపల్లి, ఆరుమాకులపల్లి గ్రామాల్లో సర్పంచ్ సరోజమ్మతో కలిసి ఆయన శుద్ధ జల కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టేకులోడు పంచాయతీలో ఎన్నో రోజులుగా తాగునీటి సమస్య ఉండేదని, దాతల సహకారంతో శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేయించామన్నారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, బయపరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గంధం పూజ

పెనుకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబయ్యస్వామి దర్గా సమీపంలో వెలసిన నాన్నా దర్గాలో స్వామివారి గంధంపూజ ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నాన్నా సాహెబ్ సహవర్తిని వంశీకులు సయ్యద్‌షా, సయ్యద్‌అలీ, సయ్యద్ కమలుద్దీన్, సయ్యద్‌షా ఖలీల్, సయ్యద్‌షా జమీల్‌అహ్మద్, సయ్యద్‌షా షాకీర్‌అహ్మద్, సయ్యద్‌షా రసూల్‌బీ ఆధ్వర్యంలో గంధాన్ని తలపై ఉంచుకుని ఫకీర్ల విన్యాసంతో ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. స్వామి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. ఉదయం అన్నదానం, ఖవాలీపోటీలు నిర్వహించారు.

ఇళ్ల పట్టాలివ్వాలని వినతి

గోరంట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం గ్రామస్థులకు ఇళ్లపట్టాలు, అనుభవ హక్కు పత్రాలను ఇవ్వాలని కార్మిక సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ మారుతికి వినతి పత్రం అందించారు. పట్టాలివ్వాలని పలుమార్లు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కార్యదర్శి పెద్దన్న, కొండా వెంకటేష్, స్వర్ణలత పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గోరంట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంజనేయస్వామి కాలనీలో వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, వార్డు సభ్యులు లక్ష్మీనాగరాజు దంపతులు సోమవారం పూజల్లో పాల్గొన్నారు. కాలనీలోని అశ్వత్థంకట్టపై వినాయక ఆలయం, నాగల ప్రతిష్ఠకు కృషి చేశారు. అలయం నిర్మించి ఏడాది కావడంతో అశ్వత్థం కట్టపైవెలసిన రాగి, వేపచెట్లకు సంప్రదాయ రీతిలో పెళ్లి చేయించారు. పురోహితులు నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కాలనీవాసుల మధ్య మంత్రోచ్చారణలతో వివాహం చేపట్టారు. నాయకులు రఘునాథ్‌రెడ్డి, అశోక్, సుబ్రహ్మణ్యం, మాజీ ఉప సర్పంచ్ సుబ్బరాయుడు, రాజు పాల్గొన్నారు.

వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌పై అవగాహన



భూసార పత్రాలు చూపుతున్న రైతులు

సోమందేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో సోమవారం కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త యుగంధర్ రైతులకు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ పథకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, మందులను నిర్మూలించి పంట సాగులో నూతన పద్ధతులతో అధిక దిగుబడులు ఎలా సాధించాలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా వైవిధ్య పంటల సాగులో మెలకువలను వివరించారు. ఏఓ కవితారాణి, ఉద్యాన అధికారి రాంప్రసాద్, వీఏఏ బాలక్రిష్ణ, వీహెచ్ఏ బాబావలి, జడ్‌పీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: రసాయన ఎరువులకు స్వస్తిచెప్పి సేంద్రియ ఎరువులు వాడటంవల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ చందన అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రాంపురం రైతు సేవా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులవాడకం, రసాయన పద్ధతుల తగ్గింపుపై అవగాహన కల్పించారు. సర్పంచ్ శ్రీనివాసులు, ఏఈఓ అశోక్‌కుమార్, రైతు సేవా సిబ్బంది రమ్యకృష్ణ, శశి, మౌనిక పాల్గొన్నారు.















